

# సంకుచితం

- రాచపూటి రమేష్





**"గాయత్రి తప్పక నా ప్రపోజల్‌ను ఒప్పుకుంటుందన్న నమ్మకం నాకుంది" కప్పులోని లెమన్ టీని చప్పరించి చెప్పాడు సుధీర్.**

**"ఔనా, నేను మూడునెలలనుండి మొత్తుకుంటూనే వున్నానుగదా, ఓసారి ఆమె దగ్గర ఈ టాపిక్ మాట్లాడమని, నువ్వే నెగ్లెక్ట్ చేస్తున్నావు. ఐనా నీకేం తక్కువని? అందముంది, లక్షల ఆస్తీ, మంచి వుద్యోగం వున్నాయి కదా" చాయ్ తాగడం పూర్తిచేసి, సిగరెట్టు వెలిగిస్తూ అన్నాడు రాజారెడ్డి, సుధీర్‌ని వుత్సాహపరుస్తూ.**

"మా ఇద్దరి మధ్యా ఆ మూడక్షరాలే అడ్డుగోడగా నిలుస్తూ వుంది" అసహనంగా అన్నాడు సుధీర్.

"కులం గురించా నువ్వు చెప్పేది? ఐనా ఈ కాలం కేస్ట్ గురించి ఎవరంత సీరియస్‌గా వున్నార్రా, గాయత్రి వాళ్లది పెద్దగా కట్నం ఇచ్చుకోగల కుటుంబం కాదని తెలిసింది కదా, అన్ని అర్హతలూ వున్న నిన్నెందుకు వాళ్లు కాదనుకుంటారు?" సుధీర్‌ను వూరడిస్తున్నట్లు చెప్పాడు రాజారెడ్డి.

"పేరెంట్స్ ఒప్పుకున్నా, గాయత్రి గురించే నాకు అనుమానంగా వుంది. ఆ అమ్మాయి కూడా బాగా ఛాందస భావాలు, కులతత్వం ఒంటబట్టించుకున్నట్లుగా కనిపిస్తోంది" దిగాలుగా అన్నాడు సుధీర్.

"ఇంత ఆలోచనెందుకు, ధైర్యే సాహసే లక్ష్మీ అన్నారు పెద్దలు, రేపు సండే గాయత్రి రూం దగ్గరే వుండవచ్చు. ఆమెనే పార్క్‌కో, ఫుడ్ జాయింటుకో పిలిచి నీ మనసులోని మాట బయట పెట్టు. ఆపై భగవంతుడున్నాడు." తాను చెప్పవలసిందంతా చెప్పేసినట్లు రాజారెడ్డి పైకి లేచాడు. కేఫ్ కౌంటర్లో సుధీర్ బిల్లు చెల్లించాడు. మిత్రులిద్దరూ హోటల్ నుండి బయటకు నడిచారు. గాయత్రితో తనకు మొదటగా పరిచయమైన రోజులు మళ్లీ నెమరేసుకున్నాడు సుధీర్.

"సార్, ఈరోజు మన ఆఫీసులో కొత్తగా జూనియర్ అసిస్టెంట్‌గా గాయత్రి అనే అమ్మాయి జాయినౌతూ వుంది" టేబిల్ ముందు ఫైళ్లు తిరగేస్తూ కూర్చున్న యూడీసీ సుధీర్‌తో చెప్పాడు అటెండర్ ప్రకాష్.

సుధీర్ తన ముందున్న ఫైల్లో గాయత్రి బయోడేటా చూశాడు. 'జొన్నవిత్తుల గాయత్రి డాటరాఫ్ చంద్రశేఖరశాస్త్రి, మదనపల్లి' అని ఆ అమ్మాయి ఫొటో, వివరాలు వున్నాయందులో. 'బ్రాహ్మల పిల్లగాబోలు' అనుకున్నాడు సుధీర్. ఆమె రికార్డులో అన్నీ ఫస్టు క్లాసులే వున్నాయి.

గాయత్రి ఫొటోలోకన్నా నిజంగా చూడ్డానికి చాలా బాగుంది. పది రోజుల్లోనే సుధీర్ సహకారంతో తాసిల్దారు కార్యాలయంలో తన పనిని చక్కగా అవగాహన చేసుకొంది. ఆమె సిన్సియారిటీని, తాసిల్దారే మెచ్చుకున్నాడు. గాయత్రి అందం సుధీర్‌ను కట్టిపడేస్తూ వుంది.

"దూరపు బంధువులింట్లో ఎంత కాలమని వుంటారు? వర్కింగ్ వుమెన్స్ హాస్టల్లో మీకు వసతి చూడమంటారా?" ఓరోజు సుధీర్ చొరవ తీసుకొని అడిగాడామెను.

"హాస్టల్ వాతావరణంలో నేను అడ్జస్ట్ కాలేననుకుంటానండీ, ఏదైనా డీసెంట్ ఫామిలీ వుండే ఇంట్లో, మేడపైన సపరేట్ గదిలా ఎక్కడైనా వుంటే చెప్పండి." అంది గాయత్రి.

ఆమె నోటిలోంచి ఆ మాట వచ్చిందే తడవుగా సుధీర్ నాలుగైదు రోజులు వెతికి గాయత్రికి మంచి రూం వెతికి పెట్టాడు. అద్దె కొంచెం ఎక్కువైనా, సింగిల్ రూం, కిచెన్, టాయిలెట్లతో సౌకర్యంగా వుందది.

"మీకు చాలా శ్రమ పెట్టినట్లున్నాను. చాలా థాంక్స్" అన్న గాయత్రి మాటలకు ఉప్పొంగిపోయాడు సుధీర్.

ఓరోజు సుధీర్ ఆఫీసుకు కాస్తా ఆలస్యంగా వచ్చాడు. ఆసరికి గాయత్రి సీట్ దగ్గర ఎవరో ముసలి వ్యక్తి కూర్చుని ఆమెతో మాట్లాడుతున్నాడు. గాయత్రి ఆయనకు వెయ్యి రూపాయలివ్వడం గమనించాడు సుధీర్. వెంటనే ఆయన రిసీట్ బుక్‌లోంచి ఏదో రసీదు చింపి, రాసి సంతకం చేసిచ్చాడామెకు.

"మన వాళ్లకోసం మీరు చూపుతున్న కన్సర్న్‌కు చాలా థాంక్సమ్మా. సండే తప్పక ప్రోగ్రాంలకు రండి" అని చెప్పి బయటకు వెళ్లిపోయాడతను.

సుధీర్‌కు ఆసక్తి పెరిగింది. ఏదో పనున్నట్లుగా లేచి వెళ్లి వరండాలో వెళ్తున్న ఆ ముసలాయన్ను కలుసుకున్నాడు. ఆ వృద్ధుడు సుధీర్ వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"నా పేరు సుధీర్. ఈ ఆఫీసులోనే పనిచేస్తూ వున్నాను. మిమ్మల్నింతకు ముందు ఎక్కడో చూసినట్లుంది" కావాలనే అన్నాడు సుధీర్, ఆయనతో మాటలు కలుపుతూ.

'నా పేరు నారాయణ శర్మ' అంటూ ఆయన తన చేతిలోని లెదర్ బేగ్ తీసి తన విజిటింగ్ కార్డ్సని సుధీర్‌కొక కార్డు అందజేశాడు.

ఎ.నారాయణశర్మ అనే పేరు క్రింద ఆయన హోదాతో బాటు నాలుగైదు సేవా సంస్థల పేర్లున్నాయందులో. వాటిలో సుధీర్‌ను ముఖ్యంగా ఆకర్షించింది 'బ్రాహ్మణ సేవా సమితి' అన్న పేరు.

"ఓహో, ఈయనగారు వాళ్ల కేస్ట్ అమ్మాయిని పెద్ద దిక్కుగా పలకరించాలని వచ్చాడు కాబోలు, ఈవిడగారు ఆయన అడగ్గానే అంత డబ్బు విరాళంగా ఇవ్వాలా? ఎంతైనా వాళ్లూ, వాళ్లూ ఒకటి" అనుకున్నాడు సుధీర్. ఐనా ఈ పెద్దాయన్ను మంచి చేసుకుంటే తన గురించి గాయత్రికి నాలుగు మంచి మాటలు చెప్పవచ్చు. ఈ విధంగా తాను గాయత్రికి చేరువ కావచ్చు" అనుకున్నాడు సుధీర్.

శర్మగారు వద్దటున్నా వినకుండా ఆయనకు తన జేబిలోంచి ఐదొందలు తీసి విరాళంగా ఇచ్చాడు సుధీర్. వెంటనే ఆయన తన రసీదు పుస్తకంలోంచి ఓ రిసీట్ రాసిచ్చాడు సుధీర్‌కు. సుధీర్ దాని వంక చూడకుండా మడచి జేబిలోకి కుక్కాడు.

'చాలా థాంక్సండీ, దేవుడు మీకు మేలుచేస్తాడు' అని నారాయణ శర్మ సుధీర్‌వద్ద శలవు తీసుకున్నాడు.

'గాయత్రి చాలా కట్టుబాట్లు, ఆచారాల మధ్య పెరిగినట్లుంది. తన వంటి ఇతర కులస్థుడి ప్రేమనంగీకరిస్తుందో లేదో' అనుకున్నాడు సుధీర్.

ఎందుకో తాసిల్దారు రాజారావు ఈమధ్య గాయత్రిపై కారాలు, మిరియాలు నూరుతున్నాడు.

ఆరోజు ఉదయం...

"తాసిల్దారుగారు మిమ్మల్ని రమ్మంటున్నారు" అటెండర్ ప్రకాష్ వచ్చి చెప్పాడు. తన సీట్లో కూర్చుని

పనిచేసుకుంటున్న సుధీర్‌కి.

"ఏమయ్యా సుధీర్, కొత్తగా చేరిన అమ్మాయికి సీని యర్‌గా నువ్వేమి గైడెన్స్ ఇచ్చేది లేదా? ఇలాగుంటే ఎలాగయ్యా? ఆ అమ్మాయి సీట్లో ఇంతకుముందు పనిచేసే గుర్నాథం వారానికోసారి తన సీట్లో వచ్చిన ఆదాయంలో నాకు పర్సెంటేజి లెక్కగట్టి ఠంచనుగా ఇచ్చేవాడు. ఈ అమ్మాయి బొత్తిగా ఆమ్యామ్యాల జోలికి పోనట్టుంది. కాస్తా ఆమెకు బ్రెయిన్ వాష్ చెయ్యి" అని సుధీర్‌కి హితోపదేశం చేశాడు తాసి ల్దారు రాజారావు.

"సరే సార్, ఎలాగోలా గాయత్రికి నచ్చజెప్తాను" అని ఆఫీసరు రూంలోంచి బయటకు వచ్చేశాడు సుధీర్. 'శ్రద్ధగా తన ఫైళ్ళలోకి తలదూర్చి పనిచేసుకుం టున్న గాయత్రికి ఇటువంటి విషయం చెప్పడం ఎలాగా?' అని ఆలోచించాడు. 'సరే, బయట ఏ కేంటి న్‌కో, పార్కుకో గాయత్రిని పిలిచి రాజారావు చెప్పిన విషయం మాట్లాడాలి. అలాగే తన మనసులోని మాట బయటపెట్టాలి" అనుకున్నాడు సుధీర్.

మరుసటిరోజు ఆదివారం సాయంత్రం ఆరింటికి గాయత్రి వుంటున్న గది దగ్గరకు ఏదో పనున్నట్లుగా హాజరయ్యాడు సుధీర్. గాయత్రి వుంటున్న రూంకు తాళం వేసుంది.

సుధీర్ ఓ పది నిమిషాలు బయటే వెయిట్ చేసి ఇక బయల్దేరుతామనుకుంటుండగా ఇంటి బయట ఆటో ఆగింది. ఆటోలోంచి చేతి సంచితో దిగింది గాయత్రి. సుధీర్‌ను చూసి ఆశ్చర్యపోయింది.

"ఈ పక్క స్ట్రీట్‌లోనే మా ఫ్రెండిల్లు. అతన్ని కలసి దారేకదా, పలకరించి పోదామని ఇలా వచ్చాను" నవ్వుతూ అన్నాడు సుధీర్.

గాయత్రి వరండాలో రెండు ప్లాస్టిక్ కుర్చీలు వేసింది. లోపలికెళ్లి ఐదు నిమిషాల్లో కాఫీ కప్పుతో తిరిగొచ్చింది.

కాఫీ తాగుతూ ఆమెను కొన్ని కుశల ప్రశ్నలు వేశాడు సుధీర్. చిన్నగా తాసిల్దారు తనకు చెప్పిన మాటలు చెప్పాడు గాయత్రికి.

"సారీ సర్, నేను ఇటువంటి విషయాలకు వ్యతిరే కిని, లంచం ఇవ్వడమూ, తీసుకోవడమూ రెండూ నేరాలే. దయచేసి నన్నిబ్బంది పెట్టకండి. కావాలంటే ఉద్యోగాన్నైనా వదులుకుంటాను గాని లంచాలు వసూ లుచేయలేను" ఖచ్చితంగా చెప్పింది గాయత్రి.

"అదెలాగండి, కొన్ని విషయాలు చూసీ చూడన ట్లుగా పోవాలి. ఇప్పుడు మీరు జీతం డబ్బులతో నెట్టు కొచ్చినా, రేపు పెళ్లయ్యాక మీకు ఖర్చులు పెరుగు తాయి. అప్పుడు పై రాబడి లేకుండా మీరు నెగ్గుకు రావడం కష్టం" అన్నాడు సుధీర్, చిరునవ్వుతో.

"చెప్పాను కదండి. నాకీ వాతావరణం నచ్చదని, ఐనా నేనిప్పుడిప్పుడే పెళ్లిచేసుకోదలచుకోలేదు. మా తమ్ముడు బి.టెక్, చెల్లెలు బి.యస్సీ చదువుతున్నారు. ముందు వాళ్లిద్దర్నీ ఓ దారికి తేవాలి" అంది గాయత్రి.

సుధీర్ ఖంగుతిన్నాడు. "పోనీలెండి. ఐనా సండే కూడా రెస్టు తీసుకోకుండా మీరేదో షాపింగ్ చేసొస్తు న్నట్టున్నారు" అన్నాడు టాపిక్ మారుస్తూ.

"లేదండి. మా వాళ్లందర్నీ ఓసారి పలకరించి, నేను చేసిన కొన్ని స్వీట్స్ ఇచ్చొస్తున్నాను. ఆదివారమే కదా నాకు తీరికుండేది" నవ్వుతూ అంది గాయత్రి.

"అబ్బా, ఈమెకు వాళ్లవాళ్లంటే చాలా అభిమానంగా వుంది. ఊరుగాని వూరు వచ్చినా వాళ్ల సావాసం వద ల్లేక పోతూ వుంది. అంతా ఆ నారాయణశర్మ చేసిన నిర్వాకం" అనుకున్నాడు సుధీర్. కాసేపు అవీ, ఇవీ మాట్లాడి గాయత్రి దగ్గర శలవు తీసుకున్నాడు.

గాయత్రిని ఆఫీసులో తరచు నారాయణశర్మ వచ్చి కలుస్తూనే వున్నాడు. ఏవో కార్యక్రమాలకూ, మీటింగు లకూ గాయత్రి హాజరౌతూనే వుంది, సాయంత్రమైతే ఇంటర్నెట్ సెంటర్లో గంటసేపైనా గడుపుతుంది.

"పైకి ఈమె పెళ్లికి వ్యతిరేకినని చెప్తూ వుంది. ఎవరో బాయ్‌ఫ్రెండ్‌తో గంటలకొద్దీ ఛాటింగ్ చేస్తున్నట్లుగా వుంది" అనుకున్నాడు సుధీర్. ఉండబట్టలేక ఓసారి గాయత్రిని అడిగేశాడు సుధీర్, ఎవరితో ఛాటింగ్ చేస్తు న్నారని.

"మా వాళ్లెందరికో నేను అప్తురాలిని. రోజు వాళ్ల నుండి వచ్చే మెసేజిలకు రిప్లై పంపేసరికి ఆలస్యమౌతూ వుంది" అంది గాయత్రి.

"సారీ సర్, నేను ఇటువంటి విషయాలకు వ్యతిరేకిని, లంచం ఇవ్వడమూ, తీసుకోవడమూ రెండూ నేరాలే. దయచేసి నన్నిబ్బంది పెట్టకండి. కావాలంటే ఉద్యోగాన్నైనా వదులుకుంటాను గాని లంచాలు వసూలు చేయలేను"

సుధీర్‌కు చిర్రెత్తుకొచ్చింది, "ఎంత సేపూ మావాళ్లూ, మావాళ్లు" అని పాకు లాడుతూ వుంటుంది. ఎంత అందం, మంచి వుద్యోగమూ వుండి ఏం లాభం? విశాలమైన భావాలు లేనప్పుడు? ఇటు వంటి ఛాందసురాలిని కట్టుకొని వుంటే తన బతుకు గంగపాలై వుండేది. ఇంకా నయం, తన మనసులో మాట గాయ త్రికి చెప్పలేదు" అనుకున్నాడు.

రానురాను తాసిల్దారు రాజారావుకు గాయత్రి పోకడ అస్సలు పడడంలేదు. "ఆమె ఫైళ్లలో నిక్కచ్చిగా వుండడం, లంచాలిచ్చే పార్టీలను దగ్గరకు చేర్చకపోవడం" అతనికి మింగుడు పడడం లేదు. ఉక్రోషంతో మింగలేక, కక్కలేక సతమతమౌతూ వున్నాడు. అడ్డమైన వంకతో గాయత్రిని చీవాట్లు పెడుతూ, లీవు కూడా ఇవ్వకుండా వేధిస్తూ వున్నాడు. ఆఫీసరు వేధింపులతోబాటు రాజ కీయ నాయకుల వేధింపులు కూడా తట్టుకోలేకుండా వుంది గాయత్రి. అనుక్షణం టెన్షన్‌తో బాధపడుతూ వుంది.

హఠాత్తుగా ఓరోజు గాయత్రి తన వుద్యోగానికి రాజీ నామా చేసిందని తెలిసింది సుధీర్‌కి. ఆదరాబాదరా ఆమెను కలుసుకున్నాడు.

"గాయత్రిగారూ, తొందరపడకండి. ఈ ఆఫీసరు ఈరోజు వుంటాడు, రేపు పోతాడు. కావాలంటే మిమ్మల్ని ఏ కలెక్టరాఫీసులోనో టెన్షన్ లేని సీటులో వేయిస్తాను. రాజీనామా వెనక్కి తీసుకోండి" అని ప్రాధేయపడ్డాడు. గాయత్రి అతని మాట ఖాతరు చేయలేదు.

"సుధీర్‌గారూ, నేనీ వాతావరణంలో ఇమడలేను. మా వూర్లో మా పేరెంట్స్ జబ్బులతో బాధపడ్తూ నా సహాయంకోసం చూస్తున్నారు. అదే వూర్లో నాకు ఇదే జీతంతో ఓ కార్పొరేట్ స్కూల్లో టీచరు వుద్యోగం వచ్చింది. నాకు టీచింగ్ ఫీల్డే హాయి" అంది గాయత్రి.

"గాయత్రిగారూ, ఎంతసేపు కులతత్వంతో మీరూ, మీవాళ్లు అని ఆలోచించకండి. అందరినీ కలు పుకుపోతూ వుంటేనే ఈ సమాజంలో బతకగలం. ఇలా చెప్తున్నానని మరోలా అనుకోకండి. మళ్లీ మనం కలుసుకోకపోవచ్చని చెప్తున్నాను" అన్నాడు సుధీర్. గాయత్రి మాట్లాడలేదు.

మరుసటిరోజు గాయత్రికి సెండాఫ్ ఇవ్వడానికి స్టేష న్‌కు వెళ్లాడు సుధీర్, ట్రైయిన్ దగ్గరకు నారాయణ శర్మగారు కూడా వచ్చారు. ఆయన దగ్గర శలవు తీసు కుంటూ వుంటే గాయత్రి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"పాపం చాలా మంచి పిల్ల. అన్నట్లు ఇక్కడకు దగ్గరే వుంది మా స్కూలు. ఓసారి రాకూడదు బాబూ, మా స్కూలుకు నువ్వుకూడా ఓసారి డొనేషన్ ఇచ్చావు గదా" అన్నాడు శర్మ. తప్పదన్నట్లుగా ఆయనతో వెళ్లాడు సుధీర్.

పది సెంట్ల స్థలంలో చిన్న పాకల్లా వేసి ఐదవ తర గతి వరకు క్లాసులు నిర్వహిస్తున్నారు. పిల్లలు యూని ఫాంలలో లేరు. ఐనా టీచర్లు శ్రద్ధగా పాఠాలు చెప్పడం, పిల్లలు వుత్సాహంగా వుండడం గమనిం చాడు సుధీర్.

"గాయత్రి కూడా తరచు ఇక్కడికి వచ్చి పిల్లలకు శ్రద్ధగా పాఠాలు చెప్తూ వుండేది. ఆమె వెళ్లిపోతూ వుందంటే పిల్లలు చాలా బాధపడ్డారు. పాపం తాము రాలిపోయే మొగ్గల్లాంటి వాళ్లని వాళ్లకు తెలియదు. ఎంత ఉల్లాసంగా వున్నారో చూడండి" శర్మగారి మాటలకు అదిరిపడ్డాడు సుధీర్.

"ఏమిటి శర్మగారూ మీరనేది?" అర్థంకానట్లు అడిగాడు సుధీర్.

"ఔను బాబూ, వీళ్లంతా హెచ్ఐవీ పాజిటివ్ వున్న పిల్లలు, తల్లిదండ్రుల నుండి ఆ జబ్బు వీళ్లకు సంక్రమించింది. ఈ ఛారిటబుల్ స్కూల్‌కి నేను కరస్పాం డెంటుని. ఇంకా ఎయిడ్స్, హెచ్చైవీతో బాధపడేవాళ్లకోసం మేము 'పాజిటివ్ పీపుల్' అనే సంస్థను రన్ చేస్తున్నాం. గాయత్రి తరచు వాళ్లను కలుసుకొని ఆత్మస్థైర్యం నూరి పోసేది. ఇమెయిల్స్, ఛాటింగ్ ద్వారా వాళ్లను ఉత్సాహ పరుస్తూ వుండేది" గంభీరంగా చెప్పాడు శర్మ.

"అంటే గాయత్రి..." అయోమయంగా అడిగాడు సుధీర్.

"ఔను బాబూ, ఓసారి చిన్న ఆక్సిడెంటైన గాయ త్రికి ఓ పల్లెటూర్లోని ఆర్ఎంపి డాక్టర్ ప్రథమ చికిత్స చేశాడు. స్టెరిలైజ్ చేయని సిరంజి ద్వారా ఆమెకు హెచ్ ఐవీ సోకింది. ఇంకా ప్రథమ దశలో వుంది. తనలాంటి వాళ్లను ఆదుకోవాలని, అనుక్షణం ఆమె ఆరాటపడేది. చాలా మంచి పిల్ల" విషాద వదనంతో చెప్పాడు శర్మ.

సుధీర్ కాళ్లకింద భూమి కంపించినట్లైంది. గాయత్రి సంకుచిత భావంతో, కులతత్వంతో ఆలోచిస్తుందనుకు న్నాడేగాని, అసలైన సంకుచిత భావాలు తనవే. ఆమె అందమూ, ఉద్యోగం చూసి పెళ్లిచేసుకోవాలనుకు న్నాడు. కానీ ఆమెకున్న సేవా దృక్పథం చూసి వెనక్కు తగ్గాడు. తన మాటలతో గాయత్రిని ఎంత బాధపెట్టి వుంటాడు?

"తరచు వచ్చి ఆ స్కూల్లోని పిల్లలతో కాలం గడిపి వాళ్లను ఉల్లాస పరుస్తూ వుంటానని" శర్మగారితో చెప్పి భారమైన హృదయంతో స్కూలు బయటకు నడిచాడు సుధీర్.

★

**రచయిత చిరునామా:**
**రాచపూటి రమేష్,**
10/585, బెల్లం మండి వీధి,
కడప- 516 001.